తండ్రికి ఆశ్చర్యంవేసింది. ఒక్క క్షణం బట్టలు సర్దటం ఆపాడు. ఎగాదిగా చూచి, "ఎందుకని? చాలా ప్రమాదంగా వుందట. ఈబండికి బయల్దేరకపోతే..." గోపీమిగిలిన మాటలు. వినలేక అవతలికి వెళ్ళిపోయాడు.

తండ్రి అలాగే అనుమానంగా క్రోధంగా గోపీనిచూశాడు. చాలా రోజులనుంచీ అతడు తండ్రికి అర్థంకావటంలేదు. మొదట్లో కొడుకులో తన ప్రతిబింబమే చూచుకొని సంతోషించేవాడు. తరువాత ఏ బింబమూ కనుపించేదికాదు. ఇప్పుడు మరీ గాడవగా, ఘోరంగా కనుపిస్తున్నాడు.

"సరే నీ యిష్టం." అని చెప్పి రైలుకు బయల్దేరిపోయాడు.

గోపీ ఒక్క నిట్టూర్పు విడిచాడు. 'పెద్దనాన్నని చూడాలి. ఆఖరిమాటలు ఈ చెవిని వేసుకోవాలి.' అని నిశ్చయించుకున్నాడు. డబ్బులేదు. వున్న అయిదురూపాయిలూ తండ్రికిచ్చాడు. ఎవర్నడగాలి ? ఎలా అడగటం ?

వూరంతా తిరిగాడు. స్నేహితులందర్నీ చూశాడు. వారితో అదీ ఇదీ మాట్లాడి డబ్బు వూసెత్తకుండా ఇంటికితిరిగివచ్చాడు. గది తలుపులు వేసుకొని వంటరిగా కూర్చొని ఏడ్చాడు.

[వెప్]

అక్కడ, గోపీతండ్రి వెళ్ళేటప్పటికే పెదనాన్న అవసానదశలో వున్నాడు.

తమ్ముణ్ణి చూడగానే, "గోపీవచ్చాడా?" అని అడిగాడు.

"నేను రమ్మన్నాను. సాయంకాలం వస్తానన్నాడు."

సాయంకాలం రైలొచ్చింది. గోపీ రాలేదు. అప్పటికే పెద

నాన్న గోపీకోసం ప్రాణాలు బిగబట్టుకొని వున్నాడు. చీమ చిటుక్కుమంటే 'గోపీ!' అనేవాడు.

రైలొచ్చింది; గోపీ రాలేదు

'గోపీని... చూడాలని... వుంది. చూడలేక... పోయాను.' అంటూ ప్రాణాలు విడిచాడు పెదనాన్న.

అందరూ గొల్లుమన్నారు—

'దుర్మార్గుడు. చూపుకైనా అందుకోకపోయాడు. ముసలి వాణ్ని అసంతృప్తితో చంపాడు.' అన్నారు. ఎవ్వరినోటికివచ్చి నట్లు వారాడిపోసుకున్నారు.

గోపీతండ్రి ఈమాటలన్నీ వింటూ కూర్చున్నాడు. మండి పోయింది. "ఛండాలుడు. కడుపున చెడబుట్టాడు—" పండ్లు పట పట కొరుకుతూ అనుకున్నాడు.

[వైప్]

ఇక్కడ గోపీకి ఆ రాత్రి నిద్రపట్టలేదు. తెల్లవారగానే లేచి, ఏమైనా వుత్తరం వచ్చిందేమో చూట్టానికి పోస్టాఫీసుకి వెళ్లాడు. వుత్తరం రాలేదు. మనస్సు కొంచెం కుదటపడ్డది. బహుశా తగ్గి వుంటుంది. మళ్ళీ ఆయన్తో భారత భాగవతాల్లోని పద్యాలు చదివించుకొని ఆనందించే అదృష్టం వుందని సంతోషించాడు. కాని అది తెచ్చిపెట్టుకున్న సంతోషం. ఏక్షణాన వైరొస్తుందో అని లోపల భయంగానే వుంది.

అటూ ఇటూ వూహించుకుంటూ ఆరోజంతాగోపీఇంట్లోనే వున్నాడు. సాయంకాలంఅయిందిగుండె కొంచెం నిబ్బరపడింది. 'తగ్గకపోతే మళ్ళీ వైరిచ్చేవారే,' అనుకొని నిట్టూర్చాడు...

ఇంతలో గోపీ తండ్రే రైలుదిగివచ్చాడు. ఆయన వాలకం చూచేటప్పటికి గోపీ గుండె బేజారపోయింది—ఏమయిందో! పెదనాన్న...అక్కడ వుండలేక, తండ్రి మొహం చూడలేక ఇంట్లోకి వెళ్ళటానికి లేచాడు.

"గోప్పీ?" అని గద్దించాడు తండ్రి.

గోప్పీ ఆగాడు. హృదయం రెపరెప లాడింది—ఏం చెబుతాడో!

"నువ్వెందుకు రాలేదు?"

గోపి మాట్లాడలేదు. శరీరం కంపించింది—

"వెధవా, నీ కోసం కలవరించి చచ్చిపోయాడు... మా వంశంలో చెడబుట్టావ్..."

గోప్పీకి ఆఖరిమాటలు వినబడలేదు. "పెదనాన్న చనిపోయాడా? చనిపోతూ పోతూ నన్ను కలవరించాడా?..." ఊగిపోయాడు.

"నాలుగురూపాయిాలు ఖర్చవుతవని—ఎంతపనిచేశావ్!"

గోప్పీ జవాబు చెప్పలేదు. తండ్రివైపుకూడా చూడలేదు. శూన్యంలోకి వెర్రిగా చూస్తూ 'కలవరించాడా!' అనుకుంటూ నిలబడిపోయాడు. తండ్రికి కోపం ఎక్కువయింది.

తండ్రి మీాదమీాదకు రావటం గోప్పీ చూడలేదు. చెంప ఛిళ్ళుమన్నది. దెబ్బతో గోప్పీ కళ్ళుగిర్రున తిరిగినై. కన్నీరు జలజల రాలింది.

తండ్రికి కోపం తీరలేదు. "వెధవా, నీసంగతి నేను కనిపెడుతూనేవున్నాను. ఇదేనానువ్వురాతల్లో ఏడ్చే ఆర్థికదృక్పథం..."

గోప్పీ తండ్రిని చూశాడు. చాల జాలిగా చూశాడు. అప్పు

డతని కండ్లకు తనతండ్రి అర్భకుల్లో అర్భకుడుగా కనిపించాడు.

ఆ చూపులు తండ్రి కోపాన్ని మరీ రగుల్కొలిపాయి.

"పో... నీబోటివాళ్ళకి నా ఇంట్లో చోటులేదు... పో!"

గోపీని బయటకునెట్టి తలుపు వేసుకున్నాడు. గోపీ నెమ్మదిగా లేచి నిలబడ్డాడు. "ఇదేనా నువ్వు రాతల్లో ఏడ్చే ఆర్థిక దృక్పథం" అనే తండ్రిమాటలు చెవుల్లో గింగురుమన్నయ్.

"ఇదే... ... ఇదే... ..." అనుకుంటూ గబగబా మెట్లు దిగిపోయాడు. విశాల ప్రపంచంలోకి—